బాహుకుడు

పదేళ్ళ క్రితం సీతారామయ్యను గురించి విసుగు లేకుండా చేసిన ప్రచారం జ్ఞాపకంవస్తే నాకిప్పుడు చాలా సిగ్గుగా ఉంటుంది. ఈ మధ్యనే ఆ విషయం నా కెవరో జ్ఞాపకం చేశారు. అతన్ని గురించిన ప్రసంగం వచ్చేసరికి "వాడి సంగతి నాకు చెప్పకండి" అన్నాను. "ఇతన్ని ఒకప్పుడు ఊరేగించినవాడివి కావూ?" అని దెప్పిపొడిచారు.

అవును, సీతారామయ్యను ఊరేగించాను ప్రపంచంలో ప్రతిభావంతులు చాలా అరుదు. రెండురకాలవాళ్ళు ప్రతిభావంతులను గురించి ప్రత్యేక శ్రద్ధ ప్రకటించరు— ప్రతిభ గుర్తించలేనివాళ్ళు నిజంగా ప్రతిభకలవాళ్ళూనూ. దురదృష్టవశాత్తూ నాకు ప్రతిభ గుర్తించే శక్తిమటుకే ఉంది, ప్రతిభ లేదు.

సీతారామయ్య చక్కగా సంగీతం పాడేవాడు. ఇప్పుడింకా బాగా పాడుతున్నాడేమో కూడానూ. అయితే నే

నతని సంగీతం చూసి ముగ్ధుణ్ని కాలేదు. నాకు సంగీతం గురించి తెలీక కాదు. నను ముగ్ధుణ్ని చెయ్యటానికి కా సంగీతం సరిపోలేదేమో అనుకుంటాను. ఏమైనా అతని సంగీతం గురించి నే నెప్పుడూ తాపత్రయపడలేదు. నన్ను బలంగా ఆకర్షించింది, అతనిలో సమగ్రంగా ఉన్న మానవత్వం.

మానవత్వానికి సంఘంలో పలుకుబడి లేదు. ఎన్నడూ ఒక నీచమైన భావం ప్రకటించని వాణ్ణీ, తన బరువు ఆవగింజంతయినా, పొరపాటునకూడా ఇతరులమీద వెయ్యని వాణ్ణీ, తన మనోవికారాలను ఏమాత్రమూ ప్రదర్శించని వాణ్ణీ నలుగురిలో ఉన్నప్పుడు సమయానికి వివేకవంతమైన మాట ఒకటి అని చెప్పిపోయే పరిస్థితిని సునాయాసంగా చక్కబెట్టేవాణ్ణీ, మనుషులు చప్పున గుర్తించరు చిన్నతనం నుంచి మానవ స్వభావాన్ని పరిశోధించటం అలవాటయింది. గనక సీతారామయ్యలో ఉన్న విచిత్రమైన సంస్కారాన్ని నేను కనిపెట్టాను. రుజువుకూడా చేసుకుని ప్రచారం ప్రారంభించాను.

ఈ ప్రచారం సులభసాధ్యంకాదు. సాటి మనిషిలో ఒక ప్రత్యేకవిద్య ఉన్నదంటే ఆమోదిస్తారుగాని, ఒక నైతిక ఆధిక్యత ఉన్నదంటే ఎవరూ త్వరగా ఆమోదించరు అటువంటి ప్రచారంచేసేవాణ్ణి కూడా క్షమించరు. కాని నా ప్రచారం నేను మానలేదు. అతని స్నేహంవల్ల నేను పూర్వంకంటె మంచివాణ్ణయినా ననే విశ్వాసంనన్ను వదలిపెట్టలేదు. నా కతనివల్ల కలిగిన ఉపకారం మాటలతో నిరూపించేదికాదు. రూపాయి అణా పైసల్లో లెక్కించేదికాదు.

అతనికి నేనేమీ ప్రత్యుపకారం కూడా చెయ్యలేదు, అతన్ని కథలు రాయమని ప్రోత్సహించటం తప్ప. ఈ ఆలోచన అయినా నాకు కలిగినది కాదు అతనంతట అతనే ఒక కథ రాశాడు రాసి దాచిపెట్టుకున్నాడు. ఒకనాడది ఎట్లాగో నాకంటపడింది. చదివాను. నా కాకథ అద్భుతంగా ఉన్నట్టు తోచింది

కథకుడుగా అతని ప్రత్యేకతను గురించి నేను వివరంగా చెప్పను. అతను రాసిన కొద్ది కథలూ వాటికవే సాక్షి. పాత్రలు అనే మాటలకూ, చేసే సామాన్యపు పనులకూ ఒక విచిత్రమైన అంతరార్థం నిరూపించేవాడు. ఏవో సన్నివేశాలు కల్పించి పాత్రలచేత గంభీరంగా మాట్లాడించవచ్చు. కొన్ని సాంఘిక భావాలు ప్రచారంకూడా చెయ్యవచ్చు. కాని మామూలు సంఘటనలే తీసుకొని మామూలుగా మనుషులు చేసే పనులకూ, అనే మాటలకూ ప్రత్యేకత తెప్పించటానికి అపూర్వమైన ప్రతిభ కావాలి సీతారామయ్య రాసినకథ చదవగానే అతను సామాన్యుడు కాదనీ, మనుషుల్ని పుస్తకాలు చదివినట్టు చదవగలడనీ, బతికుండగానే కోసి సునిశితంగా పరీక్షించగలడనీ నాకు తోచింది. అత నా కథలో ఏదో ప్రచారం చేస్తున్నట్టు కనిపించిందిగాని ఏం ప్రచారం చేస్తున్నాడంటే నాటుకు సమాధానం రాలేదు. తరవాత చాలా కాలానికి అతను ఉన్నతమైన మానవత్వం ప్రచారం చేస్తున్నాడని నేను నిర్ధారణ చేసుకున్నాను.

సీతారామయ్యను ఊరేగించటానికి నాకిప్పుడొక పల్లకీ దొరికింది. అదివరకల్లా అతన్ని వ్యక్తిగతంగా పొగడి, నోరు ఖాళీచేసుకున్నాను. కథకుడుగా అతన్ని ప్రపంచం పరిచయం చేసుకోవాలని నేను తీర్మానించాను. పట్టుబట్టి అతనికథ పత్రికకి పంపించి, కథ లింకా రాయమని అతని గొంతుమీద కూర్చున్నాను అతను నా మాట తీసెయ్యకుండా రాయటం సాగించాడు. కాని అతని కథలు ప్రత్యేకించి గుర్తించినవారు లేరు. గొప్ప కథకుడని అతన్ని పదిమందీ గుర్తించినట్లయితే అతని జీవితం ఎట్లా ఉండేదో చెప్పలేను. అప్పటికీ అతను పతనం అయివుండే వాడేనేమో గాని, ఈ కీర్తి అతన్ని కొంతవరకు రక్షించివుండేదేమోనని నా ఆశ.

"పెక్కుభంగులు వివేక భ్రష్టసంపాతముల్" అన్నారు కవి. సీతారామయ్య పతనం అకస్మాత్తుగా జరగలేదు చాలా కాలంవరకూ నాకా విషయమై సందేహం కూడా కలగలేదు.

సీతారామయ్యకు సుబ్రహ్మణ్యంతో పరిచయం కావటం నాకు తెలుసు. సుబ్రహ్మణ్యంతో నాకు స్నేహం లేదు గాని పరిచయం ఉంది. సుబ్రహ్మణ్యం సీతారామయ్య స్నేహంకోసం పాకులాడుతున్నాడని తెలిసి నే నేమీ అడ్డు పడలేదు. నేనెందు కడ్డుపడాలీ? సుబ్రహ్మణ్యం లక్షరూపాయల ఆస్తికి పెంపుడు వెళ్ళాడు. వాణ్ణి గారాబంగా చూసే పెంపుడు తల్లి ఉంది. సుబ్రహ్మణ్యం పుట్టి ఊళ్ళో వున్న

తాగుబోతులూ, జూదగాళ్లూ, ముండల ముఠాఖోర్లూ తింటున్నారు. మనుషుల్ని కాచి వడబోసిన సీతారామయ్య సుబ్రహ్మణ్యం బతుకు కనుక్కోలేడా? సుబ్రహ్మణ్యాన్ని ఆకర్షించింది సీతారామయ్య కథలు కావు, సంగీతం. ఏ ఆకర్షణ అయితే ఏం? సుబ్రహ్మణ్యం తను తగలేసే డబ్బులో కొంత సీతారామయ్యమీద తగలేస్తాడు. పోనీ, అంతవరకైనా సద్వ్యయమవుతుంది—పాపిష్టి సొమ్ము.

సీతారామయ్యను గురించి నేనేమీ అదుర్దాపడలేదు. సీతారామయ్యకు తనంత దగ్గర స్నేహితుడు మరొకరుండ రాదనే అహంభావం సుబ్రహ్మణ్యానికున్నట్టు వాసనపట్టి నేను సీతారామయ్యకు పెడపెడగా కూడా ఉంటూ వచ్చాను.

నేను సీతారామయ్య శక్తి సామర్థ్యాలను అతిగా అంచనా కట్టానేమో ననుకుంటాను. ప్రతిభావంతుడైన మనిషి పరిస్థితులను కొంతవరకు మార్చగలడనేది నిజమే కాని బలవత్తరమైన పరిస్థితులు, ప్రతిభ ఉండినా, ఒంటరిగాడైన వాణ్ణి మరింత సమ్మకంగా మార్చగలవు. సుబ్రహ్మణ్యాన్ని గురించి అందరూ తేలికచేసి మాట్లాడవచ్చు. కాని సాంఘిక శక్తులు సీతారామయ్యవంటి వ్యక్తివేపు లేవు. లక్ష సాయల వేపే ఉన్నై. సాంఘిక శక్తులముందు సీతారామయ్య — ఎంత ప్రతిభకలవాడైతే మాత్రం — ఏపాటి? ఈ సంగతి నేను తెలుసుకోలేక పోయినాను. తెలుసుకుంటే ఏం చేసి ఉండేవాణ్ణి? బహుశ ఏమీ చేసి ఉండను.

సుబ్రహ్మణ్యం. సీతారామయ్యను పాటగాడుగా రూఢి చేశాడు. సీతారామయ్య కథలు రాయటం పూర్తిగా మానేశాడు. సుబ్రహ్మణ్యం సీతారామయ్యకోసం ఒక తంబురా కొనిపెట్టాడు. ఒక తబలావాణ్ణికూడా తన పరివారంలో చేర్చాడు.

ఈ తబలిస్టు సీతారామయ్యను, 'ఏయ్, మామా?' అని సంబోధిస్తుండగా నేను స్వయంగా విని నిర్ఘాంతపోయినాను సీతారామయ్యను ఆ పరివారజనమంతా 'మామా' అని పిలుస్తారనీ, సుబ్రహ్మణ్యం అతనితో చాలా తేలిక మాటలు మాట్లాడతాడనీ విన్నాను.

సీతారామయ్య పాటలో ప్రత్యేకత ఏమీ లేదని నా అభిప్రాయం; ఆపాటకు జోహార్లు చేస్తూవచ్చినవాడు సుబ్రహ్మణ్యం. నేను పొరపాటుపడి ఉండవచ్చు. సుబ్రహ్మణ్యమే నిజం గ్రహించిఉండవచ్చు-సీతారామయ్య పాటను చాలా ఎక్కువగా ప్రజలు ప్రశంసించట నేను విన్నాను. కాని నాకుపట్టుకున్నదదిగాదు, సీతారామయ్య పాట కింత జోహార్లు చేస్తూ వచ్చిన సుబ్రహ్మణ్యం ఎట్లా, ఎప్పుడు దానికంటె ఎక్కువైనవాడైనాడు? అతనా వినయం ఎంత కాలమో నిలబెట్టుకోలేదు. తను సీతారామయ్యను పెట్టి పోషిస్తున్న కారణంచేత సీతారామయ్య పాటనుకూడా పెట్టి పోషిస్తున్నవాడల్లే ప్రవర్తించసాగాడు. సీతారామయ్య పాటను తన ఆవరణలో బాగానే ప్రచారంచేశాడు. నిజమే; కాని ఆ ప్రచారంలో తననుకూడా కలుపుకున్నాడు సుబ్ర

హ్మణ్యం సీతారామయ్య పాటలో ఏమన్నా గొప్పతనం ఉంటే అది తనచలవే ననేవిషయం సుబ్రహ్మణ్యం చక్కగా ప్రచారం చేశాడు. అనుమానాస్పదమైన సీతారామయ్య గానకాంతితో తను వెలగాలని ప్రయత్నించాడు సుబ్రహ్మణ్యం.

సీతారామయ్య చేత గ్రామఫోను రికార్డులుకూడా ఇప్పించాడు సుబ్రహ్మణ్యం. దానిమీదవచ్చిన లాభాలకంటె సుబ్రహ్మణ్యం చేతనుంచిపెట్టిన ఖర్చులే ఎక్కువయినై కాని ఇందుమూలంగా సంస్కారప్రపంచంలో ఒక అంగుళం జాగాలేని సుబ్రహ్మణ్యానికి నిలవనీడ లభించలేదా? ఈ అట్టహాసమంతాచూసి కొందరు సంస్కారులైనా సుబ్రహ్మణ్యాన్ని తమవర్గంలోకి స్వీకరించలేదా?

సుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో సీతారామయ్య స్టేజ్ఎక్కాడు. నాటకాలాడాడు. లాభనష్టాలమాట దేవుడెరుగు. సుబ్రహ్మణ్యానికి వ్యాపారదృష్టి ఏకోశానాలేనప్పుడు సీతారామయ్య ఆడిన నాటకాలు ఆర్థికంగా విజయవంతమయిందీ కానిదీ తేల్చటానికి అవకాశం ఎక్కడుంది? ప్రపంచానికి సీతారామయ్య పైకి వస్తున్నాడన్న భ్రమకలిగింది. కాని పైకివచ్చినవాడు—సీతారామయ్యను అడ్డంపెట్టుకుని తనకు సంఘంలో చొరరానిచోట్లకు వెళ్ళినవాడు—సుబ్రహ్మణ్యం.

ఆఖరుదశ సినిమా చిత్రనిర్మాణం—ఆపైన ఏమీ లేదు. ఆసినిమాచిత్రం పూర్తిఅయి బయటపడిఉంటే ఇంకేమేమి జరిగేదో చెప్పలేం. కాని అది పూర్తికావలిసిలేదు..

సీతారామయ్య కోసం దివాలాతీసినట్టు సుబ్రహ్మణ్యం అందరితోనూ చెప్పుకుంటున్నాట్ట! "నాసొమ్మంతా సీతారామయ్య తాగుడుకూ, సీతారామయ్య ముండలకూ, సీతారామయ్యను పైకితేవటానికీ పెట్టాను" అంటాట్ట సుబ్రహ్మణ్యం! ఈముక్క వచ్చి అబద్ధమైతే నేను బాధపడను. సీతారామయ్య తాగినమాట అబద్ధంకాదు, అతనిముండలూ యదార్థమే.

సీతారామయ్య తాగుబోతై తాగిఉండడనీ, చవుకబారుముండలతో వ్యభిచరించి ఉండడనీ నాకు రూఢిగా తెలుసును. అతని పనులు చెయ్యటానికీ సుబ్రహ్మణ్యానికీ సన్నిహిత సంబంధం ఉంది. కాని సీతారామయ్యను తిట్టేవాళ్ళ ఎదటనే నేతన్ని సమర్థించలేను, ఎట్లా సమర్థించనూ? సీతారామయ్య సుబ్రహ్మణ్యం వంటి అధముడి దగ్గిరికి అంత దగ్గిరగా ఎందుకు వెళ్ళవలిసివచ్చింది! సీతారామయ్య దారిద్ర్యంతో నాకు సానుభూతి ఉంది. కాని ఆ దారిద్ర్యానికి సీతారామయ్య అంతగా ఎందుకు లొంగిపోవాలి? ఎక్కడో ఒకచోట అతను తిరుగుబాటు ఎందుకు చేసి ఉండకూడదూ? కొన్ని పరిస్థితుల్లో జీవించేకంటె చచ్చిపోవటం మేలుకాదా! సీతారామయ్య అంత తప్పనిసరిఅయితే దారిద్ర్యంతో పోరాడి ఎందుకు చావలేక పోయినాడూ? నాది కఠినమైన తీర్పుగా కనిపించవచ్చు. జీవితం కఠినంగా ఉన్నప్పుడు జీవితంమీద తీర్పులు నాజూకుగా ఎట్లా ఉంటై!

సీతారామయ్య ఆత్మగౌరవంకంటె విలవైనదాన్ని పోగొట్టుకున్నాడు. అతనిభార్య సరస్వతి అతను పంపిస్తూ

వచ్చిన డబ్బు తీసుకోనే నిరాకరించిందని విన్నాను. తనకొడుకుతో సహా పుట్టింటికి చేరి ఒంటిమీద ఉన్న కొద్దిపాటి నగలు అమ్ముకుంటూ కొంతవరకు కాలక్షేపం చేసింది. ఆ తరవాత దగ్గిర బంధువుల దగ్గిర ముష్టెత్తింది. ఈసంగతివిని నేను కొంత డబ్బు పంపుతూవచ్చాను. తీసుకున్నది.

సుబ్రహ్మణ్యం తలపెట్టిన సినిమా మిషమీద తాగుడుకూ, ముండలకూ సుబ్రహ్మణ్యం డబ్బంతా అయిపోయి, సుబ్రహ్మణ్యానికీ సీతారామయ్యకూ పూర్తిగా తెగిపోయినాక సీతారామయ్య భార్య దగ్గిరికి తిరిగివచ్చాడని, భార్య అతన్ని స్వీకరించిందనీ విని సంతోషించాను గాని ఆశ్చర్య పడలేదు. భార్యను సమాధానపరిచేపాటి మానవత్వం సీతారామయ్యలో ఇంకా మిగిలి ఉంటే అందులో ఆశ్చర్యం ఏమీలేదు.

ఊళ్ళోనే ఉన్నాడని తెలిసికూడా చాలాకాలం నేను సీతారామయ్యను చూడబోలేదు. మా కిద్దరికి మధ్య ఏదో తెగిపోయినట్టయింది. కాని నిష్పక్షపాతంగా ఆలోచిస్తే సరస్వతికి లేని బెట్టు నా కెందు కుండాలో అర్థంకాలేదు. ఈ మాట అనిపించినాక సీతారామయ్యను చూడటానికి నిశ్చయించుకుని బయలుదేరి వెళ్ళాను.

సీతారామయ్య ఇంట్లో లేడు. సరస్వతి పిల్లవాడికి అన్నం పెడుతున్నది. మనిషి ఎప్పటి మాదిరిగానే ఉంది గాని ఏమాత్రమూ విచారంగా లేదు. సీతారామయ్యను

విమర్శిస్తూనే మాట్లాడాను, సరస్వతి నాపక్షం ఉంటుందని ధైర్యంతో.

కాని సరస్వతి నాపక్షం కాలేదు.

"జీవితం పాడైపోతె ఎవరుమటుకేం చేస్తారు?" అన్నదావిడ.

"దానిజోలికి పోకపోతే ఎందుకు కరుస్తుంది?" అన్నాను.

"ఇంట్లో కూచుంటే మనిషికే సంఘమూ ఉండదు గద? ఏదో సంఘంలోకి పోక ఎట్లా తప్పుతుంది?" అన్నది సరస్వతి.

"ఈ సుబ్రహ్మణ్యం సంఘం తప్ప ఇంకేమీ దొరకలేదా?" అన్నాను.

"ఇంకేం దొరికింది?" అన్నది సరస్వతి.

ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేకపోయాను. నిజానికి సీతారామయ్యగొప్ప కథకుడని ఎవరూ గుర్తించలేదు. కాని అతని సంగీతం అతిన్నీ ఉద్ధరించింది! అతను మళ్ళీ ఎప్పటి స్థితికే వచ్చాడుగద! ఈమాటే సరస్వతిని అడిగాను.

సరస్వతి నా కేసి ఆశ్చర్యంగాచూసి, "ఇప్పుడాయన కోసం ముగ్గురు ఫిలింకంపెనీవాళ్లు తిరుగుతున్నారు" అన్నది.

నేనామాట నమ్మలేకపోయినాను. కాని నిజమే అయి ఉండాలి సీతారామయ్య కథల్ని ఖాతరుచెయ్యని ప్రపంచం

అతని పాట ఆమోదించింది. నేనేదైనా, ప్రపంచం తప్పనీ నాకు తెలుసును. సుబ్రహ్మణ్యం వెంటపడి సీతారామయ్య ప్రపంచానికి దూరమైపోయినా దమకోటం నా భ్రమ — నా అహంకారం. ప్రపంచం నాకు దగ్గిరిగా లేదు. సుబ్రహ్మణ్యానికే దగ్గిర ఉంది. సాంఘికశక్తులు సుబ్రహ్మణ్యం లక్ష్యాపాయలవేపు మొగ్గినట్టే ప్రపంచం సుబ్రహ్మణ్యం సంస్థానంవేపు మొగ్గి ఉంది.

ఈ మాట సరస్వతితో చెప్పాను. చెప్పి, "ఈ ప్రపంచాన్ని ఇట్లా ఉంచటం నాకిష్టం లేదు. నా వేపు తిప్పుకోవాలి. ప్రపంచాన్ని నా పక్షం చేసుకునేటందుకు ఒకప్పుడు సీతారామయ్యను కథలు రాయమన్నాను. ఇప్పుడు నేను ఒంటరిగాణ్నయిపోయినాను" అన్నాను.

సరస్వతి నన్ను చూసి నవ్వి లోపలికి వెళ్ళి ఇంతలావు కాగితాలకట్ట తెచ్చి నాముందు పడేసింది. నాకు దాన్ని చూడగానే పరమానంద మయింది. సీతారామయ్య నన్ను ఏమర లేదు.

"ఎంతకాలంనుంచీ రాస్తున్నాడు!" అన్నాను.

"రెండేళ్ళనుంచీ"

సుబ్రహ్మణ్యందగ్గిరికి వెళ్ళిన కొద్దికాలానికే ఈ బ్రహ్మాండమైన పుస్తకం ప్రారంభించాడన్నమాట! ఎంత పొరపాటుపడ్డాను!